# అమ్మా! ఇది అనంతం!

సమయం: షికారెళ్ళిన మగవాళ్ళు గూళ్ళకి చేరేవేళ.

స్థలం: రైల్వేస్టేషను.

సందర్భం: స్నేహితులకి సెండాఫ్.

అప్పుడే సర్కారొచ్చి వెళ్ళిపోయింది. లగ్నం అయిపోయిన పెళ్ళి పందిరిలా వుంది ప్లాట్‌ఫారం. ఓవర్ బ్రిడ్జి ఎక్కడం, ఎక్కితే దిగడం మహా ఎలర్జీ మా ఫ్రెండుకి. మేము ఊళ్ళోకి వెళ్ళాలంటే మూడు ప్లాట్‌ఫారాలు దాటాలి. మరంచేత అతన్తోపాటు నేనూ రైలు పట్టాలు క్రాస్‌చేస్తూ నడవక తప్పలేదు. ఆఖరి ప్లాట్‌ఫారం అవతల ఓ ఆగిన రైలుంది. చుట్టూ చీకటి. బహుశా అది మర్నాటివరకు బైల్దేరదేమో! ఇంత చీకట్లో యీ రైలుకి ప్రదక్షిణం చెయ్యడం ఎందుకు? ఏదో ఓ పెట్టెలో యిట్నుంచి ఎక్కి అట్నుంచి దిగేద్దాం అన్నాడతను. ప్లాట్‌ఫారం లేనిచోట రైలెక్కడం ఆడవాళ్ళకి కష్టం. అయినా పరువుకోసం సరే నన్నాను.

ముందుగా అతనే ఎక్కేడు.

"పదిహేను రూపాయలు" అంది పెట్టెలోని ఆడగొంతుక.

ఎక్కబోతున్న నా కాలు భయంతో బిగుసుకుపోయింది.

రైల్లోకూడా దయ్యాలుంటాయా?

"పదండి, ఓవర్ బ్రిడ్జి ఎక్కేద్దాం" అంటూ అతను గాభరాగా దిగేసేడు.

దూరంగా ప్లాట్‌ఫారం మీదున్న లైట్ల వెల్తురు కిటికీ లోంచి పడినందువల్ల ఆ పెట్టెలో ఏవో ఆకారాలు తిరుగుతూ దయ్యాల నీడల్లా కనిపించేయి.

కొన్ని జతల గాజుల గల గల, వాటి వెనక నవ్వులు వినిపించేయి మా వెనక.

నాకు సంగతి అర్థం అయింది. అందులో నీరజ వుంది. నిర్మలకూడా వుండే వుంటుంది. సుందరీ, సుశీలా, మరకతం... వగైరా...

అది ఆగివున్న రైలుపెట్టె అయినా, పరిగెడుతున్న పాంటియాక్ కారైనా తాటాకు గుడిసైనా, తాజ్‌మహాల్ హోటలైనా కథ ఒక్కటే.

* * *

మనిషిగా పుట్టడం ఒక్కటే ప్రేమించడానికి అర్హత అయితే నీరజ నిరంజనాన్ని ప్రేమించింది.

ప్రేమ పరమ పవిత్రమైనదనీ, దాన్ని కాదనే అధికారం ఎవరికీ లేదనీ హిందీ సినీమాలు చూసి, తెలుగు నవలలు చదివీ తెగ నమ్మేసింది.ఆ నమ్మకంతోనే అతన్ని పూర్తిగా నమ్మింది. నీరజకి 'నా' అన్న వాళ్ళెవరూ లేరు ఒక్క నాన్న తప్ప. ఆ

నాన్నకి నాది అని చెప్పుకోవడానికి నీరజ కాళ, నెలకి నూటా యాభై రూపాయల ఉద్యోగం వుంది.

నీరజ, నిరంజనాల ప్రేమ అన్ని ప్రేమ వ్యవహారాల్లాగే ఊరంతా తిరిగి ఆఖరికి నీరజ నాన్న దగ్గర ఆగింది. ఊరందర్నీ ఉగ్రులాతలూగించిన విషయం అతని కేం ఆశ్చర్యం కలిగించ లేదు. నిరంజనం చదువుకున్నవాడు, ఉద్యోగం చేసుకుంటు న్నాడు, బుద్ధిమంతుడు. పైగా వాళ్ళిద్దరూ వయసులో వున్నారు. తప్పేమిటి? అనుకున్నాడు ఆ అమాయకపు తండ్రి.

ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లల్ని అవసరమైన దానికంటే కూడా ఎక్కువే నమ్ముతారు.

ఎన్నాళ్ళిలా? పెళ్ళి చేసేసుకుందాం అంది నీరజ.

పెళ్ళిని ఆడది వీలైనంత వేగంగానూ, మొగాడు వీలై నంత ఆలస్యంగా చేసుకోవాలనుకుంటారు.

దానికేం, మా అమ్మా, నాన్నలతో చెప్పివస్తా నన్నా డతను.

చెప్పేడు.

"నేను నీరజని పెళ్ళి చేసుకుంటున్నాను."

"తథాస్తు" అన్నారు అమ్మ, నాన్న.

నమ్మకం కలగలేదు నిరంజనానికి.

"మన కులం కాదు" అన్నాడు బెదుర్తూనే, యీసారి కాదంటారేమో అన్న నమ్మకంతో.

"మాకు కులం అక్కర్లేదు" అన్నారు.

నమ్మిక తప్పలేదు అతనికి.

"నిన్ను చిన్నప్పటినుంచి పెంచి పెద్దచేసి చదువు చెప్పించి యింతవాడ్ని చేశేవా?" అన్నాడు నాన్న.

"మరి ఆ డబ్బు ఏ బేంకులోనో వేసుకుంటే వడ్డీతో బలకొచ్చు" అంది తల్లి.

"మరంచేత కనీసం పాతికవేలయినా యిమ్మను నీ మావఁగార్ని. మామూలుగా అయితే నీకు రేటు బాగానే పలుకుతుంది. నీక్కావల్సిన పిల్లకదా, అది చాల్లే" అన్నా రిద్దరూ.

వాళ్ళకోరిక ఎందుకోగాని న్యాయంగా తోచింది అత నికి. తన కోరిక వాళ్ళు ఒప్పుకున్నప్పుడు. వాళ్ళ కోరికని కాదనడం అధర్మం అనుకున్నాడు.

'అధర్మం' అని గట్టిగా అరిచింది నీరజ అంతా విని. అన్యాయం, అక్రమం అని కూడా కలిపింది. మా నాన్న మాత్రం నన్ను పెంచలేదా? చదివించలేదా? మరి అతనెవర్ని అడుగుతాడు ఆ డబ్బుని? అసలు ఎవరి పిల్లల్ని వాళ్ళు పెంచు కోవడం ఊరికి ఉపకారమా? పోనీ అన్నీ ఒప్పుకున్నా పాతిక వేలు మా నాన్న ఎక్కడనుంచి తెస్తాడనుకున్నావ్? అని దులి పేసింది.

నీకు పాతికవేలు కావాలో, నేను కావాలో నిర్ణ యించుకోమంది.

"నాకు నువ్వే కావాలి. పాతికవేలు మా నాన్నకి" అన్నాడతను నీరసంగా.

"అయితే నేను అంత డబ్బు తెచ్చేవరకు ఆగు డబ్బుతో నేనే వస్తాను" అంది, 'మా నాన్న, డబ్బువద్దు. నిన్నిప్పుడే చేసుకుంటాను' అని అంటాడన్న ఆశతో.

కాని నిరంజనం ఏమనకుండానే లేచిపోయేడు. అంత డబ్బు ఎలా తేవాలీ అని ఆలోచించేలోగానే సినిమాకథని కాపీ కొట్టేసినట్టు నీరజ నాన్న, వాళ్ళ అమ్మ దగ్గరికి వెళిపోయేడు.

ప్రస్తుతం దినం గడవడానికి ఏదైనా ఉద్యోగంచేస్తే బావుణ్ణనుకుంది. కాని దిక్కులేనిదానికి ఉద్యోగం యిచ్చి ఆదుకునేటంత దీనజన బంధులు మనకి లేరు.

ఆడపిల్ల. ఒంటరిగా వుంది. వయసులోవుంది.

పైగా అవసరంలో వుంది.

మరంచేత ఆ ఊళ్ళో మొగాళ్ళకి కళ్ళు జగేల్మన్నాయి.

ఒళ్ళు జలజల లాడింది.

జుత్తు పండిన వాళ్ళుకూడా జత కలుపుదాం అనుకున్నారు.

"మమ్మల్ని నమ్ముకో. నీ యిల్లు, ఒళ్ళు బంగారంతో నింపేస్తాం" అన్నారు కొంతమంది దయామయులైన మగవాళ్ళు.

తిండిలేక చావనైనా ఛస్తానుగాని మీకు లొంగనంది నీరజ.

కాని పాపం ఆ మొగాళ్ళు ఆవిడని తిండిలేక చావ నియ్యలేదు.

ఎప్పుడైనా ఆవిడకి నిరంజనం, పాతికవేలు జ్ఞాపకంవస్తే వెర్రినవ్వు నవ్వుతుంది.

(ఈ కథలో అసందర్భాలు వెతక్కండి. ఎంచేతం టారా? అసలు ఆడదాని జీవితమే ఒక పెద్ద అసందర్భం. నీరజని నిరంజనం మోసం చేసినా, లేక మరో అప్పలమ్మని అప్పారావు సినిమాలో చేర్పిస్తానని సిటీ తీసికెళ్ళి, కట్టుకున్న కోకతో సహా విప్పేసి నారాయణమ్మ కంపెనీకి నలభై రూపాయలకి అమ్మేసినా, పెళ్ళిచేసుకుంటానని పరాయివూరు తీసుకెళ్ళి నాల్నెల్లు కాపరంచేసి మూన్నెళ్ళ కడుపుతో కాకాహోటలు బెంచీమీద వదిలేసినా, యీ కథలన్నీ చేరేది మునిసిపల్ బండీలోకే. అన్నికథలు ప్రారంభాలు వేరైనా అంతం ఒకటే.)

*　　*　　*

నీరజలాంటివాళ్ళని 'పతిత' అన్నారు ఆమె దగ్గరికెళ్ళే వాళ్ళతోసహా. "పడుపువృత్తి" అన్నారు కడుపునిండిన వాళ్ళు.

సృష్టిలో ముందు ఆకలిపుట్టి, తరవాత ప్రాణి పుట్టింది. ఈ దోపిడీలు, హత్యలు, కుట్రలు, పోరాటాలు, దొంగతనాల్లు అన్నీ ఆకలి సృష్టించినవే.

"కోటివిద్యలూ కూటికొరకే" అనికూడా మనవాళ్ళు న్నాను. మనిషిచేత ఎంతటి ఘోరం చేయించే శక్తి అయినా ఆకలికుంది. ప్రతిమనిషి ఆడ, మగ, చిన్న, పెద్ద తేడాలేకుండా అందరూ రోజుకి కనీసం ఓ పూటన్నా కడుపునిండా కాక పోయినా సగమైనా తినాలనుకోవడం కనీసపు కోరిక. ఆడది తనదగ్గర అమ్ముకోవడానికేం లేనప్పుడు తీసే వజ్రాయుధం శరీరం. అయితే కొంతమంది ఏ కారణం లేకుండా ఒళ్ళు అమ్ముకోవడంలేదా అనొచ్చు. అలాంటివాళ్ళు తక్కువ. ఉన్నా వాళ్ళజోలికెవరూ పోలేనంత ఎత్తులో వుంటారు వాళ్ళు. అంచేత వాళ్ళప్రసక్తి అనవసరం.

ఆడది మగాడిదగ్గర కెళ్ళేది 'కడుపు' కోసం. మగవాడు ఆడదానిదగ్గరి కెళ్ళేది కేవలం స్వంత శరీరసుఖం కోసం. ఎంత కడుపు నిండితే అంత ఆడ ఆకలి మగాడికి.

మోటుగా చెప్తున్నందుకు క్షమించాలి.

ఆడదాన్ది 'కడుపు వృత్తి.'

మగాడిది 'పడుపు వృత్తి.'

ఘోరనిజం చెప్పాలంటే ఆడది యుగయుగాలనుండి మొగాడికి కితకితలుపెట్టే 'కీ' బొమ్మ. ఆనాటి ఇంద్రసభలో కూడా రంభ, ఊర్వశి వగైరాలుండేవారు. "రాజుచేస్తే రసికత్వం, చాకలాడుచేస్తే రంకుతనం" అని అది స్వర్గం కాబట్టె వాళ్ళని 'అప్సరస' లన్నారు. ఇది భూలోకం కాబట్టె వీళ్ళని 'పతిత'లని 'వేశ్య'లని అంటున్నారు.

పూర్వం రాజుల కొలువులో రాజనర్తకులనీ, దేవాలయాల్లో దేవదాసీలని వుండేవారు. వీళ్ళ వృత్తి కేవలం రాజుగార్ని, దేవుడ్ని మనసు బాగులేనప్పుడు మరిపించడం, రాజు దగ్గరకొచ్చే గొప్పవాళ్ళనీ, దేవుడి దగ్గరకొచ్చే భక్తులనీ మరిపించడం. అయితే వీళ్ళు సామాన్య జనానికి అందుబాటులో వుండరు. మరంచేత ఏ స్టేజికి వెళ్ళిపోయేరంటే వీళ్ళందర్నీ ఒక కులం అన్నారు. వాళ్ళు పెళ్ళిచేసుకోవడానికి వీల్లేదు (పెళ్ళి చేసుకుంటే మగాళ్ళ గతేం కావాలి?) వాళ్ళ పిల్లలకి తండ్రి వుండడు. వాళ్ళకి (ఎంత గొప్పవాళ్ళకి పుట్టినప్పటికీ) సంఘములో గౌరవం, పరువు వగైరాలుండవు— ఇక్కడ సంఘం అంటే వాళ్ళ నాన్నలే.

అయ్యా, మీకింకో విషయం తెలుసా? ఒక మొగాడ్ని మరొక మొగాడు ఏ విధంగాను ఓడించలేకపోయినప్పుడు, సామదాన భేద దండోపాయాలన్నీ విఫలమైనప్పుడు ఆఖరి అస్త్రంగా దేన్ని వదుల్తాడు? ఆఫ్టాల్ ఒక ఆడదాన్ని, మరింక యీ బ్రహ్మాస్త్రానికి తిరుగులేన్నార్. అలనాడు అమృతాన్ని రాక్షసులు ఎత్తుకొనిపోతే దేవతలు వదిలింది ఒక ఆడదాన్ని.

ఏ మునీశ్వరుడో కఠోర తపస్సుచేసి ఇంద్రపదవికి ఎసురు పెట్టినా, లేక మరోదేవుడికి ముప్పొరాబోయినా అంతటి దేవుడు వాడేది తన మందీ మార్బలాన్నీకాదు, మారణాయుధాల్నీ కాదు, కేవలం ఒక ఆడదాని అండతో.

ఇప్పటికీ మనవాళ్ళు పురాణాల అడుగుజాడల్ని అనుసరిస్తూ అన్ని లెవల్స్‌లోనూ ఆడదాన్ని వాడుకుంటున్న దాఖలాలున్నాయి మరి!

పతిత-పతివ్రత.

రెంటికీ తేడా ఒక్క అక్షరం.

ఏకాక్షర నిఘంటువు తిరిగేస్తే బహుశా ఆ అక్షరం అర్థం 'మొగాడు' అని వుంటుందేమో!

ఆడదాన్ని పతితగా చేసినా, పతివ్రతగా చేసినా మొగాడే.

ఇద్దరి దగ్గరా మొగాడు తీసుకునేది ఒకటే.

ఇద్దరూ మగాడిమీద ఆధారపడివాళ్ళే.

కాకపోతే ఒకరు టెంపరరీ, మరొకరు పెర్మనెంటు.

'పతివ్రత'లు లేకపోయినా ఫరవాలేదు కాని 'పతిత'లు లేకపోతే మగవాడు బతకలేడు మరి.

అంచేత అమ్మా! ఇది అనంత !!! ★